సాక్షి
మహబూబాబాద్

ఆదివారం | 1 | అక్టోబర్ | 2023



వజ్రోత్సవాలు షురూ

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో▸



అవకతవకలపై స్పందించాలి

పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై ప్రభుత్వం స్పందించాలని కేయూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.4°/28.4°

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉండి, సాయంత్రం పొడి వాతావరణం ఉంటుంది.

సమస్యలు పరిష్కరిస్తాం

ఖాళీ స్థలాల్లో మున్సిపల్ బోర్డులు ఏర్పాటు చేస్తాం

- ఫాగింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం
- కోతులు పట్టేందుకు బడ్జెట్ కేటాయించాం
- 'సాక్షి' ఫోన్ ఇన్ లో మానుకోట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి



ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసన్నరాణి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా రూ.50లక్షలతో స్వీపింగ్ మిషన్‌తోపాటు, రూ.23లక్షలతో కాల్వలు శుభ్రం చేసే మిషన్ కొనుగోలు చేశామని, రూ.1.20 కోట్లతో బయోమైనింగ్ ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి తెలిపారు. మానుకోట మున్సిపల్ పరిధిలో పలు సమస్యలపై శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

మా వార్డులో మిషన్ భగీరథ, దోమలు, కోతులు, కుక్కల బెడద అధికంగా ఉంది. బోరింగ్ మరమ్మతుకు గురైంది.

– రేషపల్లి నవీన్, మంద శ్రీనివాస్, 18వ వార్డు

కమిషనర్: భగీరథ పనులు పూర్తి చేయిస్తా. రెండు రోజుల్లో బోరింగ్ రిపేర్ చేయించి సమస్య పరిష్కరిస్తా. వచ్చే వారంలో కోతులను పట్టిస్తాం.. ఏబీసీ సెంటర్ ద్వారా 3,000 కుక్కలకు ఆపరేషన్ చేయించాం.

1వ వార్డులో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. ప్రధానంగా పాత జీపీ కార్యాలయం చెత్త అక్కడే వేయడంతో దోమల సంఖ్య పెరిగింది. సమస్యను పరిష్కరించాలి.

– దీప్తి, ఈదులపూసపల్లి విలీన గ్రామం

కమిషనర్ : విలీన గ్రామాల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాం. రోడ్లపై చెత్త వేయరాదని తెలియజేశాం. ఫాగింగ్ చేయిస్తాం.

23వ వార్డులో డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్లపైకి వస్తుంది. పైప్‌లైన్ కూడా లీక్ అయింది. కోతుల సమస్య తీవ్రంగా ఉంది.

– చింతకుంట్ల వెంకన్న, కొండపల్లి గోపాల్‌రావు నగర్ కాలనీ

కమిషనర్ : వార్డులో డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తాం.

ఈమధ్యనే ఆ వార్డులో 300 కోతులు పట్టడం జరిగింది. భగీరథ లీకేజీల సమస్యలు పరిష్కరిస్తాం.

ఆర్టీసీ కాలనీలో కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమల సంఖ్య పెరిగింది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి.

– వినయ్, 15 వార్డు

కమిషనర్: రెండు రోజుల్లో కాల్వలు శుభ్రం చేయడంతోపాటు, పందుల సమస్య పరిష్కరిస్తాం. పందుల పెంపకందారులతో మాట్లాడి పందులను ఊరికి దూరంగా పంపాలని చెప్పాం.

విలీన గ్రామాలను పట్టించుకోవడం లేదు. శనిగపురం అభివృద్ధికి నోచుకోవడం లేదు. పారిశుద్ధ్య సమస్యతో మలేరియా, డెంగీ, తదితర వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

– శంతన్‌రామరాజు, శనిగపురం, 9వ వార్డు

కమిషనర్: దోమల మందు ఫాగింగ్ చేసి సమస్య పరిష్కరిస్తాం. విలీన గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపడతాం.

మాకాలనీ(కవిత కాలనీ, ఖన్నన్న కాలనీ, దాసరి నాగభూషన్‌నగర్)లో రోడ్లు, డ్రెయినేజీ సమస్యతోపాటు, దోమలు, పందులు, కుక్కలు, కోతుల సమస్య తీవ్రంగా ఉంది. తాగు నీటి సమస్య కూడా..

– కేదాస్ రమేష్, భాగ్యలక్ష్మి, రాణి, 19 వార్డు

కమిషనర్: రోడ్లు బడ్జెట్‌ను బట్టి నిర్మాణాలు చేస్తాం. ఫాగింగ్ చేస్తున్నాం. కోతులను అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నాం. తాగు నీటి సమస్య పరిష్కరిస్తాం.

ఖాళీ స్థలాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నాం. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు అవాసాలుగా మారాయి.

– రచ్చ మహేశ్వర్‌రావు, మాజీ ఉపసర్పంచ్, కృష్ణ, 32 వార్డు

కమిషనర్: ఖాళీ స్థలాల యాజమానులకు నోటీస్‌లు ఇచ్చాం. స్పందించడం లేదు. ఆస్థలాల్లో మున్సిపల్‌కు చెందినట్లుగా బోర్డులు ఏర్పాటు చేస్తేనే స్పందిస్తారు. ఫాగింగ్ చేయిస్తాం.

పందులు, కుక్కలతోపాటు, భగీరథ నీటి సమస్య ఉంది. లక్ష్మి థియేటర్ ఎదుట మూత్ర విసర్జన చేయకుండా యాజమాని చర్యలు తీసుకోవాలి. కాల్వలు శుభ్రం చేయడం లేదు. రామాస్ ఉర్దూ మీడియం పాఠశాల ఎదుట పందులు ఎక్కువగా ఉంటున్నాయి.

– ఖాజా పాషా, 34 వార్డు, మోహీన్ పాషా, జాకీర్, ఫిరోజ్ కంకరబోడ్

కమిషనర్: లక్ష్మి థియేటర్ యాజమానికి నోటీస్ ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం. కాల్వలు శుభ్రం చేయిస్తాం. పందుల సమస్య పరిష్కరిస్తాం.

దోమలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. ఖాళీ స్థలాలతోనే అసలు సమస్య.

– జెన్నారెడ్డి సౌమ్య, ఎన్జీఓఎస్ కాలనీ

కమిషనర్: ఫాగింగ్‌తో దోమల సమస్య పరిష్కరిస్తాం. ఖాళీ స్థలాల విషయంలో కఠిన నిర్ణయం తీసుకుంటాం.

ఖాళీ స్థలాలతో దోమల సంఖ్య పెరుగుతుంది. తడిచెత్త పొడి చెత్త వేరు చేసేందుకు ప్రచారం చేయాలి. వార్డుల్లో ప్రతిరోజు ఫాగింగ్ చేయాలి.

– బొడ్డుపల్లి ఉపేందర్, ఆర్టీసీ బస్టాండ్ ఎదురు వీధి

కమిషనర్ : కోతులను పట్టి గంగారం అడవుల్లో వదిలేస్తున్నారు. స్పెషల్ ఫాగింగ్ డ్రైవ్ నిర్వహిస్తాం.

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతాం

- తొర్రూరు మున్సిపల్ కమిషనర్ సరస్వతి
- 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ సరస్వతి

తొర్రూరు: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ పుప్పాల సరస్వతి అన్నారు. శనివారం సాక్షి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన 'మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

5వ వార్డు దుబ్బతండాలో డ్రెయినేజీలు సరిగా లేవు. పారిశుద్ధ్య నిర్వహణ, ఫాగింగ్ చేయడం లేదు. భగీరథ నీరు రావడం లేదు.

– భూక్యా మణికంఠ నాయక్, దుబ్బతండా

కమిషనర్: పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతాం. కొత్త డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తాం.

తొర్రూరు నుంచి మహబూబాబాద్‌కు వెళ్లేందుకు అంబేడ్కర్ విగ్రహం దగ్గర ప్రయాణికులు వేచి ఉంటారు. సులభ్ కాంప్లెక్స్ నిర్మించండి.

– మంగళపల్లి నాగరాజు, 6వ వార్డు

కమిషనర్: మహబూబాబాద్ రోడ్డులో ప్రయాణికుల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తాం.

పట్టణంలో అక్రమ వెంచర్లను నిలువరించడం లేదు. పశువుల సంతలో దారి ఆక్రమిస్తున్నారు.

– రాయిశెట్టి యాకేందర్, అంబేడ్కర్ నగర్

కమిషనర్: అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం కొత్తగా వెంచర్లు ఏర్పాటు కాలేదు. పశువుల సంత దారిని అన్యాక్రాంతం కాకుండా చూస్తాం.

పట్టణంలోని 15వ వార్డుకి చెత్త సేకరణ వాహనాలు రావడంలేదు.

– కస్తూరి పులేందర్, 15వ వార్డు

కమిషనర్: మున్సిపాలిటీలో చెత్త సేకరణ నిత్యం జరుగుతోంది. కొన్ని వాహనాలను రిపేర్ చేయించాల్సి ఉంది. దీంతో చెత్త సేకరణ వాహనాలు రావడంలో కొంత జాప్యం జరుగుతుంది.

16వ వార్డులోని కుమ్మరి బజార్‌లో వీధి దీపాలు లేవు. స్తంభాలు ఏర్పాటు చేయలేదు. చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం.

– వెలిశాల శ్రీనివాస్, 16వ వార్డు

కమిషనర్: ఎస్‌డీఎఫ్ కింద రూ.80 లక్షలు వెచ్చించి వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నాం. కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తాం.

పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.

– ఏ.మురళీకృష్ణ, టీచర్, 12వ వార్డు

కమిషనర్: యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో ఆపరేషన్లు జరుగుతున్నాయి. కుక్కల బెడద తగ్గిస్తాం.

డివైడర్లపై కోనోకార్పస్ మొక్కలు ఏపుగా పెరిగాయి. శ్వాస సంబంధిత వ్యాధులు వస్తాయని తెలిసినా వాటిని ఎందుకు తొలగించడం లేదు?

– పైండ్ల రాజేష్, 4వ వార్డు

కమిషనర్: సుందరీకరణలో భాగంగా కోనో కార్పస్ చెట్లను డివైడర్లపై పెట్టాం. ఫిర్యాదు ల నేపథ్యంలో వాటిని తొలగించి పూల మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఓపెన్ ప్లాట్లలో పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో దోమలు విజృంభిస్తున్నాయి.

– అనుమాండ్ల ప్రవీణ్‌రెడ్డి, 12వ వార్డు

కమిషనర్: ఓపెన్ ప్లాట్ల యజమానులకు నోటీసులు అందిస్తున్నాం. ప్లాట్లను శుభ్ర పరచకుంటే జరిమానా విధిస్తాం.

14వ వార్డులో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు లేవు. డ్రెయినేజీలు లేక మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తోంది.

– రామచంద్రయ్య, 14వ వార్డు

కమిషనర్: పట్టణంలో ఎస్‌డీఎఫ్ నిధులతో డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని మంత్రి దయాకర్‌రావు ఆదేశించారు. దానికనుగుణంగా అన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలు నిర్మిస్తాం.

పట్టణంలోని డీసీసీబీ ఎదురుగా వరంగల్– ఖమ్మం జాతీయ రహదారిపై వర్షపు నీరు రోజుల తరబడి నిలుస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

– మాలోతు సురేష్‌బాబు, తొర్రూరు

కమిషనర్: డీసీసీబీ ఎదుట వర్షపు నీరు నిలవకుండా తాత్కాలికంగా మొరం పోయిస్తాం. నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపడుతాం.

పందులను ఊరు బయట పెంచాలని నోటీసులు ఇస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపండి.

– నడిగడ్డ మధు, ఎరుకల బజార్

కమిషనర్: ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఊరికి దూరంలో పందులను పెంచుకోవాలి. అందుకు పట్టణ శివారులో స్థలం చూపిస్తాం.

న్యూస్‌రీల్

వ్యాధులపై అవగాహన కల్పించాలి




నెహ్రూసెంటర్: అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంబరీష సూచించారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రజలకు శారీరక శ్రమ లేకపోవడంతో బీపీ, షుగర్ వ్యాధుల తోపాటు మానసిక రుగ్మతలకు గురవుతున్నారని తెలిపారు. జీవన శైలి, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయాలని ఆరోగ్య కార్యకర్తలు, ఆశలకు సూచించారు. డీఐఓ డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ మానస, కేవీ రాజు, గీత, రాజ్‌కుమార్, రుక్ముద్దీన్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం తొర్రూర్ డీఎస్పీ వెంకటేశ్వరబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా వచ్చిన డీఎస్పీ మొదటిసారి పీఎస్‌ను సందర్శించి పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణంలో డీఎస్పీ మొక్కను నాటారు. గంజాయి, నల్ల బెల్లం సరఫరా నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు పత్రాల అందజేత



మహబూబాబాద్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జేఎన్‌టీయూహెచ్ యూసీఈ ఇంజనీరింగ్ కళాశాలకు కేటాయించిన 25 ఎకరాలకు సంబంధించిన ప్రతాలను తహసీల్దార్ ఇమ్మానియల్ ప్రిన్సిపాల్ బలరాం నాయక్, జేఎన్టీయూ చీఫ్ ఇంజనీరింగ్ భాగం అధిపతి ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రెడ్డికి శనివారం అందచేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గుమ్ముడూర్‌లోని సర్వే నంబర్ 287లో 25 ఎకరాలు భూమి కేటాయించినట్లు తెలిపారు.

ప్రణాళికతో పత్తి కొనుగోలు చేపట్టాలి

- కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా పత్తి కొనుగోలు చేపట్టాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ ద్వారా చేపట్టే పత్తి కొనుగోలుపై శనివారం కలెక్టరేట్‌లో జిన్నింగ్ మిల్స్ వ్యాపారులు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు జిల్లాలోని కేసముద్రం మార్కెట్ పరిధిలో 3జిన్నింగ్ మిల్స్, తొర్రూరులో 2, మానుకోట పరిధిలో ఒకటి ఉన్నాయని, వాటిలో పత్తి విక్రయాలు జరుగుతున్నాయన్నారు. గత సంవత్సరంలో పత్తి మొదటి రకానికి రూ.6,380 మద్దతు ధర ఉండగా.. ప్రస్తుతం రూ.7,020కి పెంచినట్లు తెలిపారు. మధ్య రకానికి రూ.6,080 ఉండగా రూ.6,620కి పెంచినట్లు పేర్కొన్నారు. పంటలను విక్రయించే రైతులు తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య పాల్గొన్నారు.

స్లాట్ ప్రారంభం

అక్టోబర్‌లో జరిగే సదరం క్యాంపులకు నేటి నుంచి అన్ని మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని కలెక్టర్ శశాంక తెలిపారు. సంబంధిత అధికారులు సదరం క్యాంపులు జరిగే ఆస్పత్రులకు వెళ్లాలన్నారు.

అన్ని రంగాల అభివృద్ధికే నీతి అయోగ్

దేశంలో వెనుకబడిన ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ ద్వారా చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా జిల్లాలోని గంగారం మండలం ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ శశాంక తెలిపారు. ప్రధాన మంత్రి నీతి అయోగ్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల పరిస్థితులను అడిగి తెలుసుకుని, నీతి అయోగ్‌ద్వారా ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చునో వివరించారు. అనంతరం అధికారులతో జిల్లాలోని గంగారం మండలంలో అభివృద్ధి పథకాల పనితీరు, ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం కార్యకలాపాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా వైద్య రంగాలపై దృష్టిపెట్టాలన్నారు. వ్యవసాయం, నీటి పారుదల, విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ రంగాల మెరుగుదలకు కావాల్సిన సౌకర్యాలు, రహదారుల నిర్మాణం చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, సీపీఓ సుబ్బారావు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది


మరిపెడ రూరల్: రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని కలెక్టర్ శశాంక అన్నారు. మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామంలో నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంఘం సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న అడ్డంకులను పరిష్కరించడానికి రైతు ఉత్పత్తి సంస్థలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోతు అరుణ, డీఏఓ ఛత్రునాయక్, హార్టికల్చర్ అధికారి సూర్యనారాయణ, ఆల్ ఇండియా రేడియో రిటైర్డ్ జనరల్ డైరెక్టర్ వేణుదారరెడ్డి, వీరసింగ్, శ్రీరంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు అనూష, బానోతు రమేష్ పాల్గొన్నారు.

భూగర్భ జలాల వినియోగం సక్రమంగా జరగాలి

భూగర్భజలాలను వినియోగించుకోవడంలో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో భూగర్భ జలాల వినియోగంపై శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో జలవనరులు పుష్కలంగా ఉన్నాయని భూగర్భ జలాలు నాలుగు శాతం పెరిగాయని తెలిపారు. భూగర్భ జలాలు వృథా కాకుండా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నీటి వినియోగం ఎక్కువగా ఉన్న చోట డిజిటల్ మీటర్లు పెట్టించాలని తెలిపాడి. అదనపు కలెక్టర్ డేవిడ్, భూగర్భజలాల అధికారి సురేష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- హైకోర్టు జడ్జి ఎం.జి.ప్రియదర్శిని



మాట్లాడుతున్న జస్టిస్ ప్రియదర్శిని

మహబూబాబాద్‌రూరల్: బాల్య వివాహాలపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు జడ్జి ఎం.జి ప్రియదర్శిని జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె జిల్లా కోర్టును సందర్శించి, న్యాయవాదులు, జిల్లా అధికారులతో సమావేశాలు నిర్వహించారు. విద్య వైద్య నిర్వహణ తీరును కలెక్టర్ శశాంక వివరించారు. బాల్యవివాహాల నియంత్రణ విధానాలపై బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ నాగవాణితో సమీక్షిస్తూ ఇకపై పోలీస్ శాఖ సహకారంతో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జస్టిస్ ప్రియదర్శిని మొదటగా జిల్లా కోర్టుకు చేరుకుని, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ తీసుకుంటున్న శ్రద్ధపై సంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుమారు పన్నెండు వేల కేసులు ఉన్నాయని, దశలవారీగా పరిష్కారమయ్యేలా చర్యలు ఉంటాయని తెలిపారు. జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కోర్టు కావాలనే కోరికను హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్పీ చంద్రమోహన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దేశబోయిన వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబు, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత, కోర్టు పరిపాలనాధికారి క్రాంతికుమార్, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, సభ్యులు డేవిడ్, అశోక్, జీపీ వెంకటయ్య, ఏజీపీ ఆనంద్ గుప్త, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ సతీష్, శ్రీనివాసరావు, అలివేలు, నాగరాజు, రామారావు, డీఎంహెచ్‌ఓ అంబరీష పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. అనంతాద్రి దేవాలయంలో జస్టిస్ ప్రియదర్శిని ప్రత్యేక పూజలు చేశారు.

వీరన్న సన్నిధిలో జడ్జి పూజలు

కురవి: భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని హైకోర్టు జస్టిస్ ప్రియదర్శిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆమెకు ఆలయ అధికారులు, పూజారులు స్వాగతం పలికా రు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందచేశారు. ఆమె వెంట మహబూబాబాద్ జడ్జి చంద్రశేఖరప్రసాద్ తదితరులు ఉన్నారు.

మెప్మా అక్రమార్కులపై వేటు

- 'సాక్షి' వరుస కథనాలతో స్పందించిన కలెక్టర్

సాక్షి స్పందన

మహబూబాబాద్ అర్బన్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలతో గ్రూప్‌లు ఏర్పాటు చేసి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తుంది. ఈదులపూసపల్లిలో 69 మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయి. సంఘాల సభ్యులు రుణాల సొమ్మును బ్యాంక్‌లో జమ చేయాలని సీఏ, సీఆర్పీలకు ఇస్తే తమ సొంతానికి వాడుకున్నారు. దీనిపై సాక్షిలో జూలై 16, జూలై 19, జూలై 25, ఆగస్టు 6, సెప్టెంబర్ 6న వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన కలెక్టర్ శశాంక డీఆర్డీఏ అధికారులు, సహకార శాఖ అధికారులతో విచారణ జరిపించారు. దీంతో సంఘాల డబ్బులు వీఓఏలు, ఆర్‌పీలు దుర్వినియోగం చేశారని తేలినట్లు స్పష్టమైంది. ఈ నివేదిక ఆధారంగా గ్రామీణాభివృద్ధి, మెప్మా పరిధిలో పనిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు డీఆర్‌డీఓ సన్యాసయ్య తన శాఖలోని వారిపై చర్యలకు ఆదేశించినట్లు సమాచారం.

క్లుప్తంగా

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన స్నేహలత



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డు అందుకుంటున్న స్నేహలత

హన్మకొండ: హనుమకొండ వడ్డేపల్లికి చెందిన సైకాలజిస్టు పైండ్ల స్నేహలత వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సాధించారు. గత నెల 24వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో 27 మందితో కూడిన బృందం 24 గంటల పాటు నిర్వహించిన వెబినార్‌లో పైండ్ల స్నేహలత 'వ్యక్తిత్వం-వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ప్రసంగించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డు సాధించారు. దీంతో స్నేహలతను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరు రాంచందర్, డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి, డాక్టర్ ఉల్లాజీ ఎలియాజర్ అభినందించారు.

హత్య కేసు నిందితుల అరెస్టు.. రిమాండ్

చిల్పూరు: మండలంలోని గార్లగడ్డతండా పంచాయతీ పరిధి కచ్చిర్లతండాలో గత నెల 24వ తేదీన అంగోతు భద్రు హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రఘునాథపల్లి సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం చిల్పూరు ఎస్సై వినయ్‌కుమార్‌తో కలిసి హత్య వివరాలు వెల్లడించారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకున్న భద్రు భార్య రమ, అత్త లావుడ్య బూలీ, చినమామ శంకర్.. గత నెల 24వ తేదీన రాత్రి మద్యం మత్తులో ఉన్న భద్రును కర్రలతో కొట్టిగా కోమాలోకి వెళ్లాడు. వెంటనే 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. అనంతరం ముగ్గురు తప్పించుకున్నారు. కాగా, తన తమ్ముడి మృతికి రమ, బూలీ, శంకర్ కారణమంటూ భద్రు సోదరుడు వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పరారీలో ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.



కేసు మూలాల్లోకి వెళ్తేనే 'నకిలీ' గుట్టురట్టు

- ఫేక్ ధ్రువపత్రాలతో ఎంబీబీఎస్ సీట్ల కేసు విచారణలో పారదర్శకత అవసరం
- మట్టెవాడ పోలీసులు లోతైన విచారణ చేస్తే మరెన్నో వెలుగులోకి వచ్చే ఛాన్స్
- వీరేనా...ఇంకా ఇతర రాష్ట్రాల్లో ఇలా ఏమైనా జరిగాయా..
- ఏపీ నీట్‌తో దొరికిపోవడంతో ఇప్పటికే రద్దయిన ఏడుగురి ఎంబీబీఎస్ అడ్మిషన్లు



సాక్షి, వరంగల్: కాళోజీ వర్సిటీలో నకిలీ ధ్రువపత్రాలతో ఎంబీబీఎస్ సీట్లు పొందారని వరంగల్‌లోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు విషయంలో సమగ్రమైన దర్యాప్తు చేస్తేనే అసలైన వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఈ కేసులో విద్యార్థుల పాత్ర ఎంత.. దందాకు సూత్రధారిగా చెబుతున్న విజయవాడలోని కన్సల్టెంట్ నిర్వాహకుడు కామిరెడ్డి నాగేశ్వర్ రావు ఏ మేరకు సహకరించారన్న విషయాలు విచారణలో వెల్లడయ్యే అవకాశముంటుంది. మట్టెవాడ పోలీసులు, కాళోజీ వర్సిటీ అధికారులు మాత్రం విద్యార్థులకు తెలియకుండానే జరిగిందని అంటూనే వారి తల్లిదండ్రులను శనివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. దీంతో అసలు ఈ కేసు విషయంలో పోలీసులు ఏ విధంగా ముందుకెళుతారా అన్నది ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. ఇది విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న అంశమని చెబుతున్న పోలీసులు.. వారికి తెలియకుండానే ఇది జరిగి ఉంటుందా అన్న దిశగానూ లోతైన విచారణ చేయాల్సి ఉంది. కన్సల్టెంట్ కామిరెడ్డి నాగేశ్వర్ రావు ఇంత ఉన్నత చదువులు చదివిన విద్యార్థుల ప్రమేయం లేకుండానే నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారా అంటే అది కూడా అనుమానించే అంశమని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెప్పిన అంశాలను నోట్ చేసుకున్న పోలీసులు కన్సల్టెంట్ కామిరెడ్డి నాగేశ్వరరావును పట్టుకునేందుకు ఏపీ పోలీసుల సాయం తీసుకుంటున్నట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకుంటేనే ఈ కేసుపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది. వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా ఈ కేసును సీరియస్‌గా తీసుకోవడంతో విచారణలో వేగిరం పెంచినట్లు తెలిసింది. ఒకవేళ అతను దొరికితే ఈ ఏడుగురు విద్యార్థుల విషయంలోనే ఇది జరిగిందా...లేదా ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ సీట్లు పొందిన వారి విషయంలోనూ నకిలీ ధ్రువపత్రాలు ఏమైనా సమర్పించారా...ఎంత పెద్ద మొత్తంలో చేతులు మారాయనే పూర్తి వివరాలు తెలవనున్నాయి.

ఏపీ నీట్‌తో దొరికిపోయారు..

2023–24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కాళోజీ వర్సిటీనుంచి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పోపులు సుబ్రహ్మణ్య సాయి తేజ, వానిపెంట సాయి ప్రతీకారెడ్డి, తమ్మినేని విష్ణు తేజారెడ్డి, తన్నీరు సంజయ్, అరికట్ల హనుమాన్ రెడ్డి, టేకులపల్లి మహేశ్, గేర్లె భార్గవ్ ధర్మతేజ యశ్వంత్ నాయుడు ఎంబీబీఎస్ సీట్లు పొందారు. వీరంతా ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో చదివినట్లు ధ్రువపత్రాలు పొందుపరిచారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఇలా చదివితే లోకల్ అభ్యర్థుల కింద సీట్లు పొందవచ్చు. దీంతో వీరంతా స్థానిక కోటాలో సీట్లు పొందారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఏపీలో చదివారు. నీట్ పరీక్ష కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి రాయడంతో అనుమానం వచ్చి ధ్రువపత్రాలతో ప్రత్యక్షంగా వర్సిటీకి రావాలని విద్యార్థులను వివరణ కోరారు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పారు. విజయవాడలోని ఒక ఏజెన్సీ నడిపే కామిరెడ్డి నాగేశ్వరరావు అనే వ్యక్తి తమకు తెలియకుండా ధ్రువపత్రాలు పొందుపరిచారని అధికారులకు తెలిపారు. దీంతో ఈ ధ్రువపత్రాలు నకిలీవని తేల్చిన వర్సిటీ అధికారులు వీరి ప్రవేశాలను రద్దు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇందులో భాగంగానే ఆ విద్యార్థుల తల్లిదండ్రులను మట్టెవాడ పోలీసులు శనివారం పిలిచి విచారించినట్లు తెలిసింది. ఈ కేసు పూర్వపరాలపై కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సంధ్యను సంప్రదిస్తే పోలీసు విచారణలోనే ఎవరిపాత్ర ఏమిటన్నదీ తేలుతుందనే సమాధానమిచ్చారు.

జోష్ ఫుల్.. సౌకర్యాలు నిల్

- దాహంతో అల్లాడిన క్రీడాకారులు
- పట్టించుకోని నిర్వాహకులు
- దాహార్తి తీర్చిన స్థానిక క్రీడాభిమానులు
- ముగిసిన టెమ్రిస్ 2వ జోష్ క్రీడోత్సవాలు

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థల (టెమ్రిస్) ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి 2వ జోష్ క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. అయితే టెమ్రిస్ అధికారుల నిర్లక్ష్యంతో అథ్లెటిక్స్ క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు గురైనట్లు తెలుస్తోంది. స్టేడియంలో కనీసం తాగడానికి మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో స్థానిక క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ క్రీడాకారులు పోటీల్లో పాల్గొని దాహంతో అల్లాడినట్లు తెలుస్తోంది. కొందరు సొమ్మసిల్లి పడిపోయినట్లు తెలిసింది. ఇది గమనించిన స్థానిక క్రీడాభిమానులు మంచినీరు, పండ్లు ఇచ్చినట్లు సమాచారం. క్రీడోత్సవాల నిర్వాహణ, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టెమ్రిస్ సెక్రటరీ షఫీయుల్లా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినా కిందిస్థాయి అధికారులు సమన్వయలోపంతో క్రీడాకారులకు కనీసం మంచినీటి సౌకర్యం, తదితర వసతులు కల్పించడంలో విఫలం చెందారని క్రీడాభిమానులు పెదవి విరుస్తున్నారు.

సింథటిక్ ట్రాక్‌పై ఇబ్బందులు..

జేఎన్‌ఎస్‌లో రన్నింగ్ చేయడానికి క్రీడాకారులు ఇబ్బందులు పడినట్లు తెలుస్తోంది. షూ అందించకపోవడంతో సింథటిక్ ట్రాక్‌పై రన్నింగ్ చేయడానికి క్రీడాకారులు ఇబ్బందులు పడ్డారు. ప్రతిభ, ప్రోత్సాహం పక్కన పెడితే కేవలం పోటీలు నిర్వహిస్తే చాలు అన్నట్లు టెమ్రిస్ అధికారుల వ్యవహార శైలి ఉందని క్రీడాభిమానులు ఆరోపిస్తున్నారు. వివిధ కేటగిరీల్లో పాల్గొనడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 బాలబాలికల మైనారిటీ గురుకులాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. అసౌకర్యాలపై టెమ్రిస్ అధికారులను సంప్రదించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడలు

వరంగల్ అర్బన్ : వరంగల్ ఇండోర్ స్టేడియంలో అండర్–14,17 విభాగాల్లో నిర్వహిస్తున్న బాలబాలిక రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడలు శనివారం సాయంత్రం ముగిశాయి. ఈ వేడుకలకు అసోసియేషన్ ప్రతినిధి జున్ను ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడల్లో గెలుపొందిన బాలబాలికలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడను వరంగల్‌లో నిర్వహించడం ద్వారా ఇక్కడి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తోడ్పడుతుందన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దుబ్బ రాము మాట్లాడుతూ అండర్–14 విభాగంలో బాలబాలికల ఫెన్సింగ్ క్రీడలు పూర్తయినట్లు పేర్కొన్నారు. కాగా, అండర్– 14 విభాగంలో లక్ష్మీనారాయణ రెడ్డి, హరి ప్రకాష్, టి. నితీష్ , వి. వరుణ్ , హిప్పి బాలికల విభాగంలో అదిబా గంగోత్రి, చరిత, అనన్య, అనన్య సింగ్, సాయి శరణ్య, శివాని, హర్షిత, బాలుర విభాగం లోకేష్, బి. ప్రకాష్ గెలుపొందారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి




హేమ్లా (ఫైల్)

నెక్కొండ: చేపల వేటకు వెళ్లిన ఒకరు..విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని పెద్దకొర్పోలు గ్రామ శివారు రేకులకుంట తండాలో జరిగింది. ఎస్సై జానీపాషా కథనం ప్రకారం తండాకు చెందిన బాదావత్ హేమ్లా (57) గత నెల 29న చేపల వేటకు వెళ్లాడు. తండాకు సమీపంలో ఉన్న కుంటలో విద్యుత్ తీగల సాయంతో చేపలు పట్టేందుకు యత్నించాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం నుంచి తీగలను కలుపుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడ ఉన్న రైతులు గమనించి చికిత్స నిమిత్తం నెక్కొండకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు భద్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముక్తార్ పాషా.. కార్మిక మార్గదర్శి

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖిలా వరంగల్ : కార్మిక ఉద్యమ నిర్మాణంలో జాతీయ జాతీయ స్థాయికి ఎదిగి అసువులు బాసిన ముక్తార్ పాషా కార్మిక వర్గానికి మార్గదర్శి అని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వరంగల్ ఫోర్ట్ రోడ్డు అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముక్తార్ పాషా వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాలు రద్దు చేసి 12 గంటలు అమలు చేస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తోందని విమర్శించారు. ప్రైవేటీకరణ పెరిగి కార్మికుల హక్కులన్నీ హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులను రక్షించుకోవడానికి విశాల కార్మిక ఉద్యమాన్ని నిర్మించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు ఎం. శ్రీనివాస్, సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, గంగుల దయాకర్, బండి కోటేశ్వరరావు, బొద్దుకుమారస్వామి, నలిగంటి విజయపాల్, రాచర్ల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ 'చాంబర్' వజ్రోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

- జ్యోతి ప్రజ్వలన చేసిన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్
- కొత్త తరాన్ని వ్యవసాయరంగం వైపు మళ్లించాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి



వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అధ్యక్షతన రెండు రోజులు నిర్వహిస్తున్న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. లక్ష్మీపురంలోని చాంబర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సభలో ఉత్సవాలను రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి, స్థానిక ఎమ్మెల్యే నరేందర్.. జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించగా, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ జరిగిన చాంబర్ 50 ఏళ్ల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు, జరుగుతున్న 75 ఏళ్ల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాన్నారు. వరంగల్ అభివృద్ధిలో చాంబర్ మమేకం కావడంతోనే మెడికల్ కాలేజీ సాకారమైందన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ముఖ్య కేంద్రంగా చాంబర్ పనిచేస్తోందన్నారు. వ్యాపారంతో పాటు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కొత్తతరాన్ని వ్యవసాయరంగం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. అన్నదాతలు, ప్రజలు, వ్యాపారులతోపాటు వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఉండాలన్నారు. చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు, ఇండస్ట్రీల యాజమానులు సహకారం వల్లే చాంబర్ నుంచి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేద ప్రకాశ్.. చాంబర్ కార్యకలాపాలపై నివేదిక సమర్పించారు. ఉత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కాగా, చాంబర్ భవనానికి మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.3 లక్షల విరాళం ప్రకటించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి.. ఏనుమాముల మార్కెట్ సమీపంలో మార్కెట్ స్థలం చాంబర్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తే తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.5కోట్లు కేటాయిస్తానని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రాష్ట్ర చైర్మన్లు బొల్లం సంపత్‌కుమార్, మెట్టు శ్రీనివాస్, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, చాంబర్ మాజీ అధ్యక్షులు టి.రమేష్‌బాబు, దిడ్డి కుమారస్వామి, కంభంపాటి కుమారస్వామి, కటకం పెంటయ్య, రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు తోట సంపత్, ప్రతినిధులు ఎస్ రెడ్డి లింగారెడ్డి, వీరారావు, రాజు కరాణి, సంపత్, సాగర్ల శ్రీనివాస్, వెల్ది చక్రధర్, స్థానిక కార్పొరేటర్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ హత్య

- వివాహేతర సంబంధమే కారణమనే అనుమానం?
- పోలీసుల అదుపులో నిందితుడు?



రాజు (ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తుమ్మల రాజు(30) హత్యకు గురయ్యాడు. కాళ్లు, చేతులను తాడుతో కట్టి హత్య చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత మృతదేహాన్ని ఎస్సారెస్పీలో పడేసినట్లు సమాచారం.. మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.మడిపల్లికి చెందిన తుమ్మల రాజు బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు.అయితే అన్నాసాగరానికి చెందిన తన బాల్యస్నేహితురాలితో రాజుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇది వివాహేతర సంబంధానికి దారితీసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈవిషయమై పలుమార్లు రాజును హెచ్చరించినా మార్పు రాలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పట్టుబడ్డడా? ఫోన్ చేసి రప్పించారా?

ఇదిలా ఉండగా, శనివారం ఉదయం నుంచి రాజు, పక్క గ్రామానికి చెందిన తన పార్టీ నాయకుడితో కలిసి అతిగా మద్య సేవించినట్లు స్థానికులు చెబుతున్నారు. తొలుత ఎల్కతుర్తిలోని ఓ వైన్‌షాపులో, ఆ తర్వాత జయగిరిలో.. అనంతరం అన్నాసాగరంలోని శ్మశాన వాటిక వద్ద మద్యం తాగినట్లు తెలిసింది.

అయితే మద్యం సేవించాక.. ఆ యువతి ఇంటికి వెళ్లి పట్టుబడ్డడా? ఫోన్ చేసి రాజును రప్పించి హత్య చేశారా అనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. దుండగులు రాజును ఇంటి వద్దే కట్టేసి ఆటోలో తీసుకెళ్లి హత్యచేసి, ఆ తర్వాత మృతదేహాన్ని ఎస్సారెస్పీలో పడేసినట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో నిందితుడు?

కాగా, హత్య అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. రాజును చంపి కాల్వలో పడేసినట్లు నిందితుడు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. ఘటనా స్థలిని కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ సందర్శించారు. రాజు పట్టుబడ్డడా? ఫోన్‌చేసి రప్పించి హత్యచేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పేకాట శిబిరంపై దాడి..

- పది మంది అరెస్ట్
- రూ.1,21,250నగదు స్వాధీనం
- రెండు కార్లు, మూడు బైక్‌లు సీజ్



పేకాటరాయుళ్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పేకాట శిబిరంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పదిమంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1,21,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, మూడు బైక్‌లు, పది సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. సీఐ అబ్బయ్య కథనం ప్రకారం పీఎస్ పరిధి గోపాల్‌పూర్ కల్లు మండువ సమీపంలోని ఓ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న గోపాల్‌పురానికి చెందిన కె.మహేందర్, హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లికి చెందిన బోడ ప్రశాంత్, గోపాలపురం కృష్ణాకాలనీ చెందిన కె.లవన్‌కుమార్, ములుగు మండలం రాంనగర్‌కు చెందిన గాదె రమేష్, భీమదేవరపల్లి మండలం మాణిక్యపురానికి చెందిన గోపి, హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన పల్లె విద్యాసాగర్‌రెడ్డి, హనుమకొండ భవానీ నగర్‌కు చెందిన గొట్టిముక్కల రవీందర్, హనుమకొండ నక్కలగుట్టకు చెందిన రాయిని సుధాకర్, హసన్‌పర్తి మండలం నాగారంలోని సప్తగిరి రైస్ మిల్లు నిర్వాహకుడు పోలసాని వెంకటేశ్వర్లు, గోపాలపురానికి చెందిన దూలం తరుణ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ అబ్బయ్య తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై స్పందించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం స్పందించి ప్రతిభ గల విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా తాము ఆత్మార్పణ చేసుకుంటామని కేయూ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం కేయూ దూరవిద్య కేంద్రం నుంచి పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ రోడ్డుపై బైఠాయించి కొంత సేపు ఆందోళన చేశారు. ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం చేసి ఉద్యోగాలు చేస్తున్న వారికి పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారని మండిపడ్డారు. కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ల అవకతవకల చిట్టాను వరంగల్ పోలీసు కమిషనర్‌కు ఇప్పటికే అందజేశామన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారంపై తాము 25 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్యమో.. యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్ ముఖ్యమో ప్రభుత్వం తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జాక్ చైర్మన్ తిరుపతి యాదవ్, జాక్ నేతలు అంబాల కిరణ్, మేడ రంజిత్ కుమార్, రాజునాయక్, నిమ్మల రాజేష్, మాచర్ల రాంబాబు, ఎండీ పాషా, అంకిల్ల శంకర్ , మట్టెడ కుమార్ , ఆరెగంటి నాగరాజు, కేతపాక ప్రసాద్, ప్రశాంత్, కాయిత నాగరాజు, రమేష్, హర్షవర్ధన్, మనోహర్ , విజయ్ పాల్గొన్నారు. కాగా, సీపీ రంగనాథ్.. విద్యార్థి నాయకులను తన కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారని సమాచారం. విద్యార్థులు ఇచ్చిన వివరాలను తాను కేయూ వీసీ రమేష్‌కు పంపానన్నారు. దీనిపై వీసీ నాలుగురోజుల్లో సమాధానం ఇస్తారని రంగనాథ్ విద్యార్థులతో అన్నట్లు సమాచారం.